సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



కొనసాగుతున్న బ్యాట్స్‌మన్ జోరు

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అంతర్ రాష్ట్రాల అండర్-23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో బ్యాట్స్‌మన్ జోరు కొనసాగుతోంది. - 8లో



విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి చెందాడు. పొలంలో బోరు డ్రిల్లింగ్ పనులు చేస్తుండగా విద్యుత్‌తీగ బోరుబండిని తాకడంతో ప్రమాదం జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.220
రెండోరకం	రూ.80	రూ.158



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 94 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	320	452
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1,822.820 కిలోలు

న్యూస్‌రీల్

24న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : పౌర్ణమి సందర్భంగా ఈనెల 24న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు మదనపల్లె ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు బయలుదేరి వెళ్లి గిరి ప్రదక్షిణ తరువాత మరుసటి రోజు ఉదయం 4 గంటలకు బయలుదేరి మదనపల్లెకు వస్తుందన్నారు. టిక్కెట్ల కోసం అసిస్టెంట్ మేనేజర్‌ను 7382875034, ఏడీసీని 7382877300 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీసీ మంత్రం జపిస్తున్న ఆధిపత్య కులపార్టీలు



మాట్లాడుతున్న కేసన శంకరరావు

రాయచోటి అర్బన్ : ఆధిపత్య కులపార్టీలన్నీ బీసీలను ఓటుబ్యాంకుగానే చూస్తూ, బీసీ మంత్రం జపిస్తున్నట్లు ఏపీ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విమర్శించారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ ఓట్లను దృష్టిలో ఉంచుకునే ఆధిపత్య కులపార్టీన్నీ సంక్షేమం,అభివృద్ధి మాటున బీసీ మంత్రాన్ని జపిస్తున్నాయన్నారు. బీసీల్లోని అనైక్యతను ఆసరాగా చేసుకుని..వారిని పలురకాల ప్రలోభాలకు గురిచేస్తూ.. విభజించు పాలించు సూత్రంతో గద్దెనెక్కెందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా బీసీలంతా రాజ్యాధికార సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో రాయచోటి బిసిసంఘం నేతలు దువ్వూరి నరసింహాచారి, ఇడగొట్టు నాగేశ్వరరావు, సుధాకర్, హబీబుల్లా, కె.వి.రమణ, బాలాజీ, పురుషోత్తం, ఈశ్వరయ్య,నాగార్జునాచారి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ శిక్షణకు ఎంపిక



నరసింహారెడ్డి

సంబేపల్లె : పాఠశాల విద్యలో అమలుపరుస్తున్న ఉత్తమ విధానాలపై శిక్షణకు సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి ఎంపికయ్యారు. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే శిక్షణలో ఆయన పాల్గొననున్నారనారు. ఈ కార్యక్రమంలో తమ పాఠశాలలో వినూత్నంగా అమలుపరుస్తున్న నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, పాఠశాలకు హాజరుకాని విద్యార్థులపై ప్రతిరోజు పేరెంట్స్‌తో నిర్వహించే ఫోన్‌ఇన్ కార్యక్రమం, డిజిటల్ విధానంలో వినూత్న బోధన వంటి అంశాలపై ఆయన నివేదించనున్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : స్పందన కార్యక్రమం ద్వారా పలు సమస్యల పట్ల అందిస్తున్న ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని జిల్లా పోలీస్‌యంత్రాంగాన్ని ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని త్వరితగతిన పరిష్కరించి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. స్పందన ద్వారా అందిన 52 ఫిర్యాదులపై ఎస్పీ బాధితులతో మాట్లాడారు. వీటిని పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నూతన నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఎన్ఆర్ఐ విభాగం గల్ఫ్ కౌన్సిల్ ఆఫ్ కంట్రీ (జీసీసీ) కమిటీని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. జీసీసీ కన్వీనర్‌గా బీహెచ్ ఇలియాస్, కో కన్వీనర్‌గా గోవిందు నాగరాజు, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఎం. నరసారెడ్డి, నాయిని మహేశ్వర్‌రెడ్డి, ఎం. వర్జిల్ బాబు, కోర్‌కమిటీ సభ్యులుగా షేక్ ఫయాజ్, ఎస్. చంద్రశేఖర్, షేక్ గౌస్‌బాషా, ఎస్. జయరాజు, నల్లి నాగేశ్వరరావులను నియమించారు. ఇందులో రైల్వే కోడూరు నగరిపాడుకు చెందిన మూరి వెంకట నరసారెడ్డి, వెంకటరెడ్డి పల్లెకు చెందిన నాయని మహేశ్వర్ రెడ్డిలను వైఎస్ఆర్‌సిపి గల్ఫ్ అడ్వైజర్లు నియమించడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గల్ఫ్‌లో ఉన్న మన తెలుగు వారికి అండగా ఉంటామని తెలియజేశారు.

ఔను..

ఆయనకు టికెట్ లేదు!

- రమేష్‌రెడ్డికి టికెట్ లేదని తేల్చిచెప్పిన రాష్ట్ర అధ్యక్షుడు
- చంద్రబాబునుకలిసే అవకాశం ఇవ్వాలని కోరినా నిరుపయోగమే
- పొలిట్‌బ్యూరో సభ్యుడు, సోదరుడు శ్రీనివాసులరెడ్డిపై రమేష్ గరంగరం
- టీడీపీతో అమీతుమీకి సిద్ధమవుతున్న వైనం
- కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం



రమేష్‌కుమార్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కడప : రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి పార్టీ వీడనున్నారా..? కుటుంబ సభ్యుడే అన్యాయానికి ఒడిగట్టారని విశ్వసిస్తున్నారా.. చంద్రబాబు నియంతృత్వ, ఏకపక్ష ధోరణిపై ప్రతీకారం తీర్చుకునేందుకు రగిలిపోతున్నారా? అని ప్రశ్నిస్తే విశ్లేషకులు ఔను అనే సమాధానం ఇస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే రమేష్‌రెడ్డి వ్యవహార శైలి కనిపిస్తోంది. సోమవారం లక్కిరెడ్డిపల్లె కేంద్రంగా కార్యకర్తలు, అనుచరులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. టికెట్ లేదంటూ తేల్చి చెప్పిన అధిష్టానంపై ప్రతీకారం తీర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆరు మండలాల నాయకులతో సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచర ప్రకటించేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

ఇరువైఏళ్లుగా పార్టీనే అంటిపెట్టుకున్నాం, నిరంతరం కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నాం. ప్రభుత్వ వ్యతిరేక అన్నీ కార్యక్రమాలు చిత్తశుద్ధి చేపట్టాం. అయినప్పటికీ టీడీపీ అధిష్టానం టికెట్ నిరాకరిస్తోంది. ఎవరి విజయం కోసం పనిచేయాలని చెబుతోంది. ఇక పార్టీలో ఉండలేం, మనదారి మనం చూసుకోవాలని సన్నిహితులతో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, రీజనల్ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డిలు మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిని పిలిపించుకొని మాట్లాడారు. ఈమారు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని తేల్చి చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. అందుకు ప్రత్యామ్నాయంగా మీకేమి పదవి కావాలో చెప్పండి, అధినేత చంద్రబాబుతో చర్చిస్తామని చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేయడం మినహా మరే పదవి వద్దని రమేష్ రెడ్డి కుండ బద్దలు కొట్టినట్లు సమాచారం. ఒక్కసారి అధినేత చంద్రబాబుతో మాట్లాడించండి, తర్వాత నిర్ణయం తీసుకోవాలని కోరినా నిష్ప్రయోజనమే అయినట్లు తెలుస్తోంది. కాగా సోమవారం మండలాల వారీగా కార్యకర్తలు అనుచరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత లక్కిరెడ్డిపల్లె మండల నాయకులతో ప్రత్యేకంగా సమావేశమైన రమేష్‌రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి చేపట్టలేదని వివరిస్తూనే, ఎన్నికల్లో పోటీ చేసి తీరుతామని ప్రకటించారు.

సోదరుడు శ్రీనివాసులరెడ్డిపై గుర్రు

చంద్రబాబు టికెట్ నిరాకరణకు సోదరుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి సగం కారకుడని మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి విశ్వసిస్తున్నట్లు తెలుస్తోంది. రాయచోటి టికెట్ మా అన్నకు ఇవ్వకపోతే తాను కూడా పోటీ చేయలేనంటూ టీడీపీ అధిష్టానం తేల్చి చెప్పలేదనే ఆవేదనతో ఉన్నట్లు సమాచారం. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తల ఊపి వచ్చాడని, ఎన్నికల్లో ఓడిపోతే రాజ్యసభ సీటు ఇస్తామనే హామీ మేరకే శ్రీనివాసులరెడ్డి మౌనం వహించారని తెలుస్తోంది. కుటుంబం, సోదరుడు కంటే శ్రీనివాసులరెడ్డికి పదవే ముఖ్యమైందా? ఇక తనతో కూడా తెగదెంపులు చేసుకోవాలనే దిశగా రమేష్‌రెడ్డి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. రెడ్డెప్పగారి కుటుంబ సభ్యులు, బంధువులంతా మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి నిర్ణయానికే అనుగుణంగా నిలిచేందుకు సంసిద్ధులైనట్లు తెలుస్తోంది.

చంద్రబాబు ఫొటో ఎత్తేశారు

సోమవారం సాయంత్రం లక్కిరెడ్డిపల్లె మండల టీడీపీ కేడర్‌తో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి చంద్రబాబు ఫొటో ఫ్లెక్సీలో లేకుండా ఏర్పాటు చేశారు. ఎన్టీరామారావు, తన తండ్రి మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డి ఫొటోలు మాత్రమే ఫ్లెక్సీలో వాడుకున్నారు. ఎక్కడ కూడా టీడీపీ జెండా ఏర్పాటు చేయలేదు. పైగా తన సోదరుడు పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి ఫొటో కూడా ఫ్లెక్సీలో లేదు. ఇవన్నీ రమేష్‌కుమార్‌రెడ్డి టీడీపీ వీడేందుకు చిహ్నాలుగా స్పష్టం చేస్తున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఆరు మండలాలకు చెందిన కేడర్‌తో సమావేశం పూర్తయిన తర్వాత టికెట్ విషయమై బహిర్గత పర్చనున్నట్లు సమాచారం. ఇరువై ఏళ్లుగా మీకు తోడు నీడగా ఉంటున్నా, ఇప్పుడేమి చేయాలో మీరే చెప్పాలని కార్యకర్తల అభిప్రాయాలు కోరనున్నట్లు తెలుస్తోంది. కలిసివచ్చే వారందరితో కలిసి టీడీపీ పార్టీ పదవులకు రాజీనామా చేయాలనే ఆలోచన దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది.

పదోతరగతి పరీక్షలు

పకడ్బందీగా నిర్వహించాలి

- కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

రాయచోటి : మార్చిలో జరగబోయే పదోతరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో విద్య, వైద్య, విద్యుత్, పోలీస్, ట్రెజరీ తదితర శాఖల అధికారులతో మార్చి 18 నుంచి 30వ తేది వరకు జరగబోయే పదోతరగతి పరీక్షలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో చాలా కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ముందుగా జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి పదోతరగతి పరీక్షలపై వివిధ అంశాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 129 కేంద్రాల్లో 25వేల 522 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని, వీరిలో 3056 మంది ఇంతకు ముందు ఫెయిల్ అయ్యి ఇప్పుడు రాస్తున్నారన్నారు. 13003 మంది విద్యార్థులు, 12519 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు అవుతారని తెలిపారు. ఇదే తేదిలలో మధ్యాహ్నం రెండున్నర నుంచి ఐదున్నర వరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ కింద పదోతరగతి, ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఓపెన్ స్కూల్ పరీక్షలకు 3051 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో 982 మంది పదోతరగతి.. 2069 మంది ఇంటర్ పరీక్షలు రాస్తారన్నారు. ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు చేరవేయడంలో, జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చడంతో జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ హెచ్చరించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు వేసవికాలంలో నిర్వహిస్తున్నందున వడదెబ్బ తగలకుండా విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. జీవితంలో పదోతరగతి పరీక్షలు ఒక చిన్న భాగం మాత్రమేనని, అదే జీవితం కాదని, పరీక్షలను ప్రశాంతంగా రాయాలని విద్యార్థులకు కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ బాబు, రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఎంహెచ్ఓ కొండయ్య, ఆర్డీఓ దినేష్ చంద్ర, డీటీఓ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అందిన ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయాశాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు, మదనపల్లి ఆర్డీఓ హరిప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కారం చూపించాలన్నారు.

టోల్‌ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎన్నికల ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేయబోయే టోల్‌ఫ్రీ నంబరును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయబోయే టోల్‌ఫ్రీ నెంబర్ 1950కు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఎటువంటి ఫిర్యాదునైనా ఈ టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయవచ్చన్నారు. మదనపల్లె ఆర్డీఓ హరిప్రసాద్, ఏడీ మార్కెటింగ్ త్యాగరాజు, పీడీ డీఆర్‌డీఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్విట్జర్లాండ్ ది ఫ్యాక్టర్‌తో ఏఐటీఎస్ ఎంఓయూ



ఒప్పందపత్రాలను ఏఐటీఎస్ తరఫున అందుకుంటున్న కృష్ణమోహన్‌రాజు

రాజంపేట : ఏఐటీఎస్ ఐఈఎస్(ఇండోయూరో సింక్రొనైజేషన్), స్విట్జర్లాండ్ దేశానికి చెందిన ది ఫ్యాక్టర్-వై కంపెనీల మధ్య మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్(అవగాహన ఒప్పందం) కుదిరినట్లు ప్రిన్సిపాల్ నారాయణ సోమవారం తెలిపారు. ఈ ఒప్పందం వలన విద్యార్థులు, అధ్యాపకులు వారి కొత్త పేటెంట్లను , కొత్త ఆవిష్కరణలను ది ఫ్యాక్టర్ వై అనేక కంపెనీ ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలను నెలకొల్పి వాణిజ్యం చేసేందుకు వీలు కల్పిస్తుందన్నారు. ఈ ఒప్పంద పత్రాలను ఏఐటీఎస్ తరఫున డా.దొమ్మరాజు కృష్ణమోహన్‌రాజు, టీహబ్ హైదరాబాదులో ఐఈఎస్, దిఫ్యాక్టరీ-వై కంపెనీల నుంచి అందుకున్నారు. ఈ ఒప్పందంపై ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ డా.రామచంద్రారెడ్డిలు హర్షం వ్యక్తంచేశారు.

ప్రాజెక్టుల సీఈగా మల్లికార్జునరెడ్డి నియామకం



కడప సిటీ : ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్‌గా (సీఈ) మల్లికార్జునరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందడంతో ఆయన సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన జీఎన్ఎస్ఎస్ ఎస్ఈగా మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. వైఎస్సార్ జిల్లాలో జీఎన్ఎస్ఎస్ ఎస్ఈగా ప్రాజెక్టుల పనుల విషయంపై పురోగతి సాధించారు. ఆయకట్టు లక్ష ఎకరాలకు పెరిగేందుకు కృషిచేశారు. గతంలో తెలుగుగంగలో డీఈగా, హంద్రీనీవాలో ఈఈగా, జీఎన్ఎస్ఎస్ ఎస్ఈగా పనిచేశారు. జనవరి 31వ తేదీన ఇక్కడ సీఈగా ఉన్న హరినారాయణరెడ్డి పదవీవిరమణ పొందడంతో ప్రభుత్వం ఈయనను పదోన్నతిపై సీఈగా నియమించారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ. తెలుగుగంగ ప్రాజెక్టు ఆయకట్టు పనులు, జీఎన్ఎస్ఎస్ కెనాల్‌కు సంబంధించి డిస్ట్రిబ్యూటరీ అభివృద్ధి పనులు, రాయలసీమ డెవలప్‌మెంట్ ప్రాజక్టులు అన్నీ కూడా త్వరలోనే పూర్తి చేసేందుకు అందరి సహకారంతో కృషిచేస్తామన్నారు.

నేత్రపర్వం..పుష్పయాగం





పుష్పయాగానికి హాజరైన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ముగిసిన కడపరాయుడి బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : తిరుమల తొలిగడపలో వెలిసిన కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఇందులో భాగంగా రాత్రి పుష్పయాగం నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ కార్యక్రమం భక్తులను పరవశింపజేసింది.ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతిరోజు కస్తూరి, కర్పూర, చందన పరిమళాలతో నిండి ఉండే ఆ ప్రాంగణంలో నేడు పలు రకాల సుమ సుగంధాలు మరింత సమ్మోహన పరిచాయి. మల్లెలు, జాజులు, సంపెంగలు, గులాబీలు, కనకాంబరాలు, చామంతులు తమ పరిమళాలతో కడప రాయుడు శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామిని అభిషేక వేదికకు ఆహ్వానించాయి. స్తుతిమెత్తని తమ రేకుల మెత్తాదనాన్ని మృదుత్వాని, ఆస్వాదించమని మనసారా కోరాయి. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పీఠంపై ఇరువైపుల దేవేరులతో కొలువుదీరిన స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి యాగాన్ని ప్రారంభించారు. ఆలయ అర్చకులు, మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్, కృష్ణమూర్తి, సహాయకులతో కలిసి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తులసి, మరువం, దవనం లాంటి పరిమళ దళాలు యాగం కోసం ప్రత్యేకంగా బుట్టల కొద్దీ తీసుకొచ్చారు. మంత్రోచ్చాటనల మధ్య ఒక్కో రకం పూలతో స్వామి, అమ్మవార్లను అభిషేకించారు. వాద్య విద్వాంసులు సప్త స్వరాలను ఆలపిస్తుండగా జరిగిన ఈ కార్యక్రమాన్ని తిలకించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, మాజీ చైర్మన్లు, పాతకడప, దేవునికడప గ్రామాల పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాల్గొన్న డిప్యూటీ సీఎం, మేయర్

పుష్పయాగంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్బీ అంజద్‌బాషా, మేయర్ కె. సురేష్‌బాబు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, ఇన్‌స్పెక్టర్ అర్చక బృందం సంప్రదాయ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం వారు పుష్పయాగంలో పాల్గొన్నారు. తమ వంతుగా పుష్పాలు సమర్పించారు.

వైఎస్సార్‌సీపీ యూకే కోర్ కమిటీ మెంబర్‌గా కార్తీక్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యునైటెడ్ కింగడమ్ కోర్ కమిటీ మెంబర్‌గా ప్రొద్దుటూరుకు చెందిన భూమిరెడ్డి కార్తీక్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

కడపకోటిరెడ్డిసర్కిల్ : స్థానిక ప్రజారవాణా అధికారి (డీపీటీఓ) కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఆర్టీసీ సమస్యలపై డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎం పీ.గోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను 9959225848 నంబర్‌కు కాల్ చేసి, తెలియచేయవచ్చని తెలిపారు.

అవగాహన సమావేశాలు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కొండయ్య

రాయచోటి అర్బన్ : జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, సిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ సేవలపై డివిజన్‌ల వారీగా అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య తెలిపారు. ఏపీ రాష్ట్ర ఆరోగ్యకుటుంబ సంక్షేమశాఖ కమిషనర్,విజయవాడ వారి ఆదేశాల మేరకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 20వతేదీ మధ్యాహ్నం 2గంటలకు మదనపల్లె జిల్లా వైద్యశాలలో, ఈనెల 21 న రాయచోటి ఎన్‌జిఓ సభా భవనంలో రాయచోటి డివిజన్ వారికి, అదేరోజు రాజంపేట ఏరియా ఆసుపత్రిలో స్త్రీల వ్యాధి నిపుణులు, చిన్నపిల్లల డాక్టర్లు, శస్త్రచికిత్స నిపుణులు, పెథాలజిస్టులు, ల్యాబ్స్, స్కాన్‌సెంటర్‌ల యాజమాన్యానికి సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో మాతా,శిశుసంరక్షణ సేవలు, ప్రసవాలు, సిజేరియన్ కాన్పులు, గర్భస్రావాలు, కుటుంబ నియంత్రణ పద్ధతులు గురించి వివరించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రవేటు ఆసుపత్రులు, స్కాన్‌సెంటర్లు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్స్ కేంద్రాల వా రు తమ డివిజన్‌లలో నిర్వహించే అవగాహన సమావేశాలకు తప్పనిసరిగా హాజురు కావాలని కోరారు.

- 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు
- పాతికేళ్లపాటు వేధించిన చంద్రబాబు
- అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల్చిన వైఎస్ జగన్

కల నెరవేర్చారు



ఉద్యోగాలు ఇచ్చిన సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు (ఫైల్)

నాడు 1998లో డీఎస్సీ అభ్యర్థులు చాలా మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం పరీక్షలు రాసిన వేలాది మందికి అన్యాయం చేసింది. పోస్టింగ్‌లు ఇవ్వకుండా సంవత్సరం పాటు వేధించింది. న్యాయం చేయాలని చంద్రబాబు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదు. దీంతో విధి లేక అభ్యర్థులు కోర్టు మెట్లెక్కారు. టీడీపీ సర్కారు వారికి అన్యాయమే చేసింది.

నేడు చంద్రబాబునాయుడి హయాంలో నష్టపోయిన 1998 డీఎస్సీ బాధితులు ప్రజా సంకల్ప యాత్రలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. డీఎస్సీలో అర్హత సాధించినా .తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి వేదనను విన్న వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చారు. వారి పాతికేళ్ల కలను నెరవేర్చారు. వారందరూ ప్రస్తుతం ఉద్యోగాలు పొంది సంతోషంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు జగనన్న రుణం తీర్చుకునే సమయం అసన్నమైందని సగర్వంగా చెబుతున్నారు.

మదనపల్లె సిటీ: మాటంటే మాటే. ఇచ్చిన మాట కోసం .ప్రజలకు ఇచ్చిన హామీ కోసం కట్టుబడేవాళ్లు ఈ కాలంలో చాలా కొద్ది మందే ఉంటారు. అలాంటి కోవకు చెందిన వారే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. నాడు ప్రజాసంకల్పయాత్రలో 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చారు. పాతికేళ్లుగా ముప్పుతిప్పలు పెట్టిన చంద్రబాబు వేధింపులకు చరమగీతం పాడారు. ఎట్టకేలకు 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చి భరోసా కల్పించారు. జగనన్న సకారం వల్లే తమకు ఉద్యోగాలు వచ్చాయని ఉప్పొంగిపోతున్నారు.

- 1998 డీఎస్సీ పరీక్షలు రాసి, ఉత్తీర్ణత సాధించి 24 సంవత్సరాలు ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. నాటి ప్రభుత్వాలు వారి వేదన ఆలకించలేదు. ప్రస్తుతం వారందరికీ ఎంటీఎస్ (మినిమం టైం స్కేల్) విధానంలో ఉద్యోగాలు కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 533 మంది 1998 డీఎస్సీ అభ్యర్థులు టీచర్లుగా విధుల నిర్వహిస్తున్నారు. 2008 డీఎస్సీలో అర్హత పొంది పలు కారణాలతో ఉద్యోగాలు పొందలేకపోయిన వారికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 468 మందికి మినిమం టైం స్కేల్‌తో విధులు నిర్వహిస్తున్నారు.

న్యాయం చేశారు



నోటిఫికేషన్ రాగానే ఎంతో కష్టపడి ఉద్యోగం కోసం పరీక్ష రాశాం. అర్హత పొంది ఉద్యోగం వస్తుందని సంతోషపడ్డాం. అయితే టీడీపీ ప్రభుత్వం మోసం చేసింది. అయినా 24 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేశాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మాకు ఉద్యోగం ఇచ్చి న్యాయం చేశారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. – షేక్ జమాల్‌బాషా, 1998 డీఎస్సీ టీచర్, మదనపల్లె మండలం

24 ఏళ్లు నిరీక్షించాం



న్యాయం కోసం టీడీపీ పాలకుల వద్దకు ఎన్నో సార్లు తిరిగాం. కానీ న్యాయం జరగలేదు. మా సమస్యలను కనీసం వినేవారు లేదు. 24 ఏళ్ల పాటు నిరీక్షించాం. ఇక మాకు టీచర్ ఉద్యగం రాదని అనుకున్నాం. ప్రజాసంకల్పయాత్రలో సమస్యను చెప్పుకున్నాం. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే న్యాయం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. – విశ్వనాథరెడ్డి, 1998 డీఎస్సీ టీచర్, రామసముద్రం మండలం

ఎంతో సంతోషంగా ఉంది



న్యాయం చేస్తానని ప్రజా సంకల్ప యాత్రలో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. మమ్మల్ని టీచర్‌గా చేసి కలను సాకారం చేశారు. . ఏ నాయకుడు చేయని న్యాయం వై.ఎస్ జగన్ చేశారు. ఎంతో సంతోషంగా ఉంది. – కె.రవికుమార్, 1998 డీఎస్సీ టీచర్, కురబలకోట మండలం

క్లుప్తంగా

అత్తపై అల్లుడి దాడి

మదనపల్లె సిటీ : అత్తపై అల్లుడు దాడి చేసిన సంఘన నిమ్మనపల్లె మండలంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తవళం పంచాయతీ కొండ సానివారిపల్లెలో ఉంటున్న తన కుమార్తె రాణిని చూసేందుకు చిన్నమండెం మండలం బోనమల్లకు చెందిన చంద్రగిరి రెడ్డమ్మ (50) వచ్చింది. కుమార్తెను ఎందుకు కొడుతున్నావని అల్లుడు రమణను నిలదీసింది. దీంతో ఆగ్రహించిన అల్లుడు రమణ, అతని తమ్ముడు శ్రీనాథ్‌లు కలిసి రోకలిబండతో రెడ్డమ్మను చితకబాదారు. స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం గొల్లపల్లి రింగ్‌రోడ్డుకు చెందిన భాస్కర్ భార్య రాణి(29) సోమవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు... గొల్లపల్లి రింగ్‌రోడ్డుకు చెందిన భాస్కర్ భార్య రాణి భర్తతో గొడవపడింది. ఈ క్రమంలో రాణి గుర్రంకొండ మండలం ఎలుట్ల పంచాయతీ శీలంవారిపల్లెకు తన వదిన అనూష ఇంటికి వెళ్లింది. అక్కడ నిద్ర మాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీ కొని ఆటో బోల్తా


- ఇరువురు విద్యార్థులకు గాయాలు

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని ఉప్పరపల్లె సమీపంలో బైక్ ఢీ కొని ఆటో బోల్తా పడిన సంఘటనలో ఇరువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు పెద్దగంగయ్య తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని సోమవారం సాయంత్రం ప్రొద్దుటూరు నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో ఉప్పరపల్లె గ్రామంలోని పాఠశాల వద్దకు వెళ్లగానే ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొనడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో చాపాడు మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన అమీనా, అబ్దుల్లా అనే ఇద్దరు పిల్లలు గాయ పడ్డారు. గాయపడిన పిల్లలను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో మూడో తరగతి చదువుతున్న అమీనా అనే చిన్నారికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న పెద్దగంగయ్యకు కూడా గాయాలు కాగా మరో ముగ్గురు విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్‌కాల్స్

- ట్రేడ్‌లైసెన్స్ చెల్లించాలంటూ ఫోన్‌లో దబాయింపు
- అత్యవసరంగా ఫోన్ పే చేయకపోతే షాప్ సీజ్ చేస్తానని హెచ్చరిక
- ఫోన్ కాల్స్‌కు మోసపోవద్దన్న మున్సిపల్ కమిషనర్ ప్రమీల

మదనపల్లె : ''హలో...నేను మున్సిపల్ కమిషనర్‌ని మాట్లాడుతున్నాను. మీ షాప్ ట్రేడ్‌లైసెన్స్ ఫీజు పెండింగ్ ఉంది. అర్జంటుగా ఫోన్ పే చేస్తారా...? లేక షాప్ సీజ్ చేసేయమంటారా..? త్వరగా తేల్చుకోండంటూ.... మదనపల్లె పట్టణంలోని పలువురు షాప్ యజమానులకు సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు ఫేక్ ఫోన్ కాల్స్ వచ్చాయి. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి ఆఫీసర్ మాట్లాడినట్లుగానే దబాయించడం, ట్రేడ్ లైసెన్స్ పెండింగ్ విషయం చెప్పడంతో నిజమని నమ్మిన పలువురు ఫీజు చెల్లించేందుకు సిద్ధపడ్డారు. వారిలో కొందరు మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీల అయితే... మగవ్యక్తి కమిషనర్ అని చెప్పడమేంటనే సందేహంతో మున్సిపాలిటీలో తమకు తెలిసిన వ్యక్తులను విచారించారు. వారు కమిషనర్‌గా కొత్త వ్యక్తులు ఎవరూ రాలేదని చెప్పడంతో తమకు ఫోన్ వచ్చిన విషయాన్ని తెలిపారు. వారు మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫోన్ వచ్చిన నెంబర్.. 09391717856 ను ట్రూ కాలర్‌లో వెతికితే...ఒకసారి మదనపల్లె గోపాలది మున్సిపల్ కమిషనర్ అని, మరోసారి ఉప్పల్ హైదరాబాద్ జీహెచ్ఎంసీ మున్సిపల్ కమిషనర్ గోపాల్‌రెడ్డిగా చూపించింది. ఫోన్ వచ్చిన షాపు యజమానులతోనే ఫోన్‌లో మాట్లాడించి...ట్రేడ్ లైసెన్స్ చెల్లించేందుకు మున్సిపాలిటీకి వచ్చామని, మీరెక్కడ ఉన్నారని అడిగితే... మీరు వచ్చేంతవరకు నేను వెయిట్ చేయాలా...? మీకోసం చూసి ఇప్పుడే మీ షాపు వద్దకు వెళుతున్నాను. త్వరగా ఫోన్ పేలో పెండింగ్ బకాయి చెల్లించండంటూ దబాయించాడు. దీంతో వారు అవతలి వ్యక్తి మోసగాడని గ్రహించి, తమలా ఇతరులు మోసపోవద్దని మున్సిపాలిటీలో సంబంధిత అధికారులకు చెప్పి వెళ్లారు. ఈ విషయమై కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ... పట్టణంలో కొందరు షాపు యజమానులకు తన పేరుతో ఫేక్ కాల్స్ వచ్చినట్లు తెలిసిందన్నారు. మున్సిపల్ సిబ్బంది ఎవ్వరూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను తమ వ్యక్తిగత నెంబర్లకు ఫోన్ పే, లేదా ఇతర మార్గాల్లో చెల్లింపులు చేయాలని కోరడం జరగదన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకుని, అలాంటి ఫేక్‌కాల్స్‌ను నమ్మి మోసపోకుండా...మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులను కార్యాలయంలోని కౌంటర్‌లో చెల్లించాల్సిందిగా కోరారు.



మదనపల్లె మున్సిపల్ కమిషనర్ పేరుతో వచ్చిన కాల్ స్క్రీన్‌షాట్

22న శ్రీ శ్యామలా మాతాంగీదేవి విగ్రహ ప్రతిష్ట

చెన్నూరు: చెన్నూరు మండల పరిధిలోని పుష్పగిరి రోడ్డులో గల కాశీపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్యామలా మాతాంగీదేవి ఆలయంలో ఈ నెల 22 వ తేదీన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బోలా వెంకట సుబ్బయ్య, సుధాకర్, రవి కుమార్ , మల్లేశ్వర్ రెడ్డి, శివ శంకర్, వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10-39 గంటలకు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి చేతుల మీదుగా శ్రీ శ్యామలా మాతాంగీ దేవి యంత్ర, విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

బండలాగుడు పోటీలు : ఉత్సవాల్లో భాగంగా 22 న న్యూ కేటగిరి విభాగం వృషభ రాజములచే జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు జరుగుతాయని తెలిపారు. మొదటి బహుమతి రూ. 40 వేలు, ద్వితీయ బహుమతి రూ .30 వేలు, మూడవ బహుమతి రూ. 20 వేలు, నాలుగవ బహుమతి రూ. 10 వేలు, ఐదవ బహుమతి రూ. 5 వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపు రేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ఒక్క రోజులోనే ధ్రువీకరణపత్రాలు వచ్చాయి



గతంలో ఏవైనా ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా సకాలంలో పత్రాలు అందేవి కావు. పైగా ఎంతో కొంత డబ్బు ముట్టచెప్పనిదే సర్టిఫికెట్లు చేతికి వచ్చేవి కావు. నాకు వైఎస్సార్ చేయూత పథకం కోసం , నా మనవరాళ్లకు చదువుల కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాల్సి వచ్చింది. ఇంత త్వరగా ధ్రువీకరణ పత్రాలు ఎలా పొందాలి అని అనుకుంటున్న సమయంలో మా వార్డు వలంటీర్ ప్రియాంక వచ్చి జగనన్న సురక్ష కార్యక్రమంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తారని, అవసరమైన వాటికి సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో వెంటనే దరఖాస్తు చేసుకున్నాను. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఒక్క రోజులోనే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. జగనన్న పాలన చాలా బాగుంది.

- బి.లక్ష్మిదేవి, దర్గావీధి, బద్వేలు

జగన్ సార్ రుణం తీర్చుకోలేనిది



మాది మైదుకూరు మండలం తువ్వపల్లె గ్రామం. మా అత్తమామలకు ఇద్దరు కుమారులు, ఉమ్మడి కుటుంబం నుంచి వేరుపడ్డాక నా భర్త రవితేజ కుమార్‌రెడ్డి, నేను, పిల్లలం అద్దె ఇంటిలో ఉండేవాళ్లం. నాకు ఒక కుమారుడు, కుమార్తె. మాకు పొలం లేదు. వ్యవసాయ కూలీలం. సొంత ఇల్లు ఉంటే బాగుండును అనుకునే సమయంలో జగన్ సారు ముఖ్యమంత్రి కావడం, మాకు ఇల్లు మంజూరు కావడం జరిగింది. ఇల్లు కట్టుకోవడంతో మాకు సొంత ఇల్లు లేని బెంగ తీరింది. ఇప్పుడు సొంతింటిలో ఉండటం నిశ్చింతంగా ఉంది. దానికి తోడు నా కుమారుడు యువ రాజ్ కుమార్ రెడ్డి నాలుగో తరగతిలో ఉండగా ఒక సారి అమ్మ ఒడి కింద ఆర్థిక సాయం అందింది. నా కుమార్తె యశ్వంతి మూడో తరగతిలో ఉండగా ఒకసారి, ఇప్పుడు నాలుగో తరగతిలో ఉండగా మరొకసారి అమ్మ ఒడి ఆర్థిక సాయం అందుకున్నాను. జగనన్న ఇస్తున్న అమ్మ ఒడి ఆర్థిక సాయంతో పిల్లల చదువులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్దతో మా పిల్లలు బాగా చదువుకుంటున్నారు. జగనన్న రుణం ఎలా తీర్చుకోవాలి. అందుకే ఆయనకు ఎప్పటికీ మద్దతుగా ఉంటాం.

- యనమల రామతులసి, తువ్వపల్లె, మైదుకూరు మండలం

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

- బోరుడ్రిల్లింగ్ చేస్తుండగా తాకిన విద్యుత్ తీగలు
- మృతుడు చత్తీస్‌గఢ్ వాసి
- ముగ్గురు కూలీలకు స్వల్పగాయాలు

పెద్దమండ్యం: విద్యుత్ షాక్‌తో చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు సోమవారం మృతి చెందాడు. ఓ రైతు పొలంలో కొత్తగా బోరు డ్రిల్లింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ తీగ బోరుబండిని తాకడంతో ప్రమాదం జరిగింది. వివరాలలోకి వెళితే.. మండలంలోని శిద్దవరం గ్రామ పంచాయతీలోని మల్లయ్యగారిపల్లెకు చెందిన రైతు తన పొలంలో కొత్తగా బోరు వేసేందుకు బోరుబండిని పిలిపించారు. అయితే బోరు పాయింటు పెట్టిన చోటే పై భాగంలో మల్లయ్యగారిపల్లె వద్ద ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే విద్యుత్ వైరు వెళుతోంది. బోరుబండిని పాయింట్ వద్ద పెట్టి పనులు చేసే క్రమంలో విద్యుత్ వైరు తాకడంతో షాక్ తగలడంతో రంజిత్ (24) అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. రైతు పొలం వద్ద బోరుబండికి విద్యుత్ షాక్ తగిలి ఒకరు మృతిచెందినట్లు తెలియడంతో గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. షాక్‌తో గాయాలైన ముగ్గురు కూలీలను 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా బోరు వేస్తున్నట్లు సంబంధిత అధికారులకు రైతు తెలియజేసి ఉంటే ప్రమాదం జరిగేది కాదు.


విద్యుత్ తీగను తాకిన బోరుబండి (ఇన్‌సెట్) మృతిచెందిన యువకుడు రంజిత్

కూలి కోసం వచ్చి..

తమిళనాడుకు చెందిన బోరుబండి యజమాని వద్ద చత్తీస్‌గఢ్‌కు చెందిన ఐదుగురు కూలీలు పనులు చేస్తున్నారు. రోజువారీ పనుల్లో భాగంగా మల్లయ్యగారిపల్లెకు చెందిన మల్లికార్జున అనే రైతు పొలంలో బోరు వేసేందుకు వెళ్లారు. బోరుబండి విద్యుత్ తీగను తాకడంతో ఆపరేటర్‌గా పని చేస్తున్న రంజిత్ అక్కడికక్కడే మృతిచెందాడు. కూలికి వచ్చిన యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో సంఘటనా స్థలం వద్దకు చేరుకున్న స్థానిక గ్రామస్తులు కన్నీరు పెట్టారు. సంఘటనపై ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

రాయచోటి: వివిధ కారణాలతో ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మరో వారం రోజులు గడువు కేటాయిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ వరకు అర్హులైన జర్నలిస్టుల నుంచి వెబ్‌సైట్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్నా కొన్ని సాంకేతిక కారణాల కారణంగా సబ్మిట్ కొట్టని వారికి ఆయా జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ అవకాశాన్ని కల్పించినట్లు ఆయన తెలిపారు. www.i pr.a p.g-o-v.i n వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకునే జర్నలిస్టుల దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

'ఆన్‌లైన్ గేమ్ యాప్' ద్వారా చీటింగ్

- జిల్లాలో కోట్లాది రూపాయలు పెట్టుబడి.. కోకొల్లలుగా బాధితులు
- ఇటీవల జి.వి ఫుట్‌బాల్, తరువాత మూన్ ఫుట్‌బాల్
- తాజాగా లింక్ ద్వారా 'ఆన్‌లైన్ గేమింగ్ యాప్'

కడప అర్బన్ : ఏవ్యక్తి అయినా సరే రూ. 1000 పెట్టుబడిగా పెట్టండి. రెండు నెలలలోపే రోజుకు కొంత డబ్బుల ప్రకారం రెండు నెలల్లో రూ. 11వేలు లాభంగా ఇస్తామని 'ఆన్‌లైన్ గేమ్ యాప్' తాజాగా జిల్లాలోని ప్రజలను మోసం చేసింది. ఈ యాప్ నిర్వాహకులు ప్రారంభంలో సభ్యునిగా చేరాలంటే లింక్‌ను వాట్సాప్ ద్వారా పంపిస్తారు. ఆ లింక్‌ను ఓపెన్ చేస్తే దాని ద్వారా డబ్బులను ప్రాథమికంగా రూ.1000 చెల్లించి తమ పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలి. ఆ తరువాత ఆయా గేమ్ యాప్ ద్వారా నిర్వాహకులు సూచించినట్లు గేమ్‌లను ఆడుతూ ఉండాలి. ప్రతి రోజూ కొంత నగదును వారివారి బ్యాంక్ ఖాతాలకు గానీ, వారు సూచించిన మేరకు ప్రతి రోజూ డబ్బులను పంపించడం, రెండు నెలల్లోపే రూ. 1000లకు అక్షరాలా రూ. 11,000 ఇస్తామని నమ్మబలికించారు. ప్రారంభంలో కొంతమంది సభ్యులకు రెండు నెలలకు రూ. 11000 వచ్చేలా చేశారు. తరువాత లాభం పొందిన వారు చాలా మంది సభ్యులను లింక్‌ల ద్వారా సభ్యులుగా చేర్పించారు. కొందరు అత్యాశకు వెళ్లి తమ దగ్గరున్న బంగారు, ఇళ్లను, స్థలాలను కుదువ పెట్టి, అప్పులు చేసి మరీ ఈ యాప్‌లో డబ్బులను పెట్టారు. కొన్ని రోజుల నుంచి ఈ యాప్ నిర్వాహకులు ఇప్పటికే రూ. కోట్లలో డబ్బులను జమచేసుకుని పరారైనట్లు, బోర్డు తిప్పేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. గత ఏడాదిలో ఇదే తరహాలో లింక్ ద్వారా 'జి.వి.ఫుట్‌బాల్ ఆన్‌లైన్ గేమింగ్ యాప్' ద్వారా నష్టపోయిన బాధితులు జిల్లాలో వేలాది రూపాయల నుంచి లక్షలాది రూపాయలను నష్టపోయారు. జిల్లా పోలీసు యంత్రాంగం సైబర్ నేరం కింద నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. తాజాగా ఈ 'ఆన్‌లైన్ గేమ్ యాప్' ద్వారా నష్టపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

మగడు కాదు.. మృగాడు

- నిండు గర్భిణిని రోడ్డు పాల్జేసిన భర్త
- స్పందించి ఆస్పత్రిలో చేర్పించిన ఆశావర్కర్
- బాధితురాలిది కర్ణాటకలోని బాగేపల్లె

బి.కొత్తకోట : నిండు గర్భిణి అన్న కనికరం కూడా లేకుండా ఓ భర్త తన భార్యను ఊరుకాని ఊరికి తీసుకొచ్చి నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిన ఉదంతం సోమవారం రాత్రి బి.కొత్తకోటలో వెలుగుచూసింది. ఓ ఆశా వర్కర్ గర్భిణి పరిస్థితి చూసి ఆస్పత్రికి తీసుకెళ్లింది. బాధితురాలు, స్థానికుల కథనం మేరకు వివరాలు. కర్ణాటకలోని బాగేపల్లెకు చెందిన వెంకటేష్, గంగ (35) భార్యాభర్తలు. వీరు కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం కాగా మూడోసారి గంగ గర్భం దాల్చింది. ఈ పరిస్థితుల్లో ఏమి జరిగిందో ఏమో రెండురోజుల క్రితం గంగ బాగేపల్లె, చేలూరులో సంచరిస్తూ బి.కొత్తకోటకు వచ్చింది. ఆమె అక్కడక్కడా తిరుగుతూ ఆదివారం నుంచి బీసీ కాలనీలో రోడ్డుపైనే ఉంటోంది. సోమవారం రాత్రి ఈమె పరిస్థితి గమనించిన స్థానిక ఆశావర్కర్ వై.భారతి ఆమెవద్దకు వెళ్లి విచారించింది. భర్త తనను వదిలేసి వెళ్లాడని చెప్పింది. నిండుచూలాలు కావడంతో భారతి ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యులకు విషయం వివరించింది. వైద్యులు, సిబ్బంది ఆమెకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్యపరమైన ఇబ్బందులు లేవని నిర్ధారించారు. అనంతరం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయడంతో గంగను 108లో తీసుకెళ్లి చేర్పించారు. తోడుగా వెళ్లిన ఆశావర్కర్ స్కానింగ్, ఇతర పరీక్షలు చేయించింది. ఈమె ఉదంతంపై వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.


ఆస్పత్రిలో గర్భిణీ గంగ

కొనసాగుతున్న బ్యాట్స్‌మన్ జోరు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అంతర్ రాష్ట్రాల అండర్-23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో బ్యాట్స్‌మన్ జోరు కొనసాగుతోంది. రెండోరోజు సోమవారం 372 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు మరో 6 పరుగులు చేసి 378 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఎస్. వెంకటరాహుల్ 66 పరుగులు చేశాడు. రైల్వేస్ జట్టు బౌలర్లు జైశ్వాల్ 3, కుమార్ 3, దమన్‌దీప్‌సింగ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రైల్వేస్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 84 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. జట్టులోని రవిసింగ్ 211 బంతుల్లో 10 ఫోర్లు, 13 సిక్సర్లతో 196 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈయనకు జతగా అన్ష్ యాదవ్ 120 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆంధ్రా బౌలర్లు సంతోష్‌కుమార్ 1, చెన్నారెడ్డి 1 వికెట్ తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.


196 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన రైల్వేస్ బ్యాట్స్‌మన్ రవిసింగ్


120 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన రైల్వేస్ బ్యాట్స్‌మన్ అన్ష్ యాదవ్

యురేనియం మైన్స్‌లో ముగిసిన భద్రతా వారోత్సవాలు

వేముల : మండల పరిధిలోని తుమ్మలపల్లె యురేనియం మైన్స్‌లో సోమవారం భద్రతా వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి నెల్లూరు డీఎంఎస్ రఘుపతి పెద్దిరెడ్డి, యూసీఐఎల్ టెక్నికల్ డైరెక్టర్ రాజేష్‌కుమార్, నెల్లూరు డీజీఎంఎస్ కె.ఏ.నాయుడులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మైన్స్ సిబ్బందిచే భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. భద్రతా వారోత్సవాలలో ట్రేడ్ టెస్ట్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యురేనియం ప్రాజెక్టులో భద్రతే బాధ్యతగా క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. అనంతరం యూసీఐఎల్ జీఎం ఎం.ఎస్. రావు, ఏజెంట్ కిశోర్ భరత్, మైన్స్ మేనేజర్ శేఖరం బాబు, భద్రతా ఆఫీసర్ చంద్ర శేఖర్, ఎస్ఎంఎస్ సీఈఓ ఖలీల్, పీఎం రాములుతోపాటు అధికారులను అభినందించి స్మారక చిహ్నం అందించారు.


మైన్స్ భద్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న యురేనియం అధికారులు, కార్మికులు

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడి మృతి

మైదుకూరు : మైదుకూరు పట్టణ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీముల్లా (22) అనే యువకుడు మృతి చెందాడు. కరీముల్లా అతని భార్య బైక్ పై వెళుతుండగా మైదుకూరు- బద్వేలు రహదారిలోని గోపిరెడ్డిపల్లె సమీపంలో ఎదురుగా ట్రాక్టర్ రావడంతో అక్కడే ఆగి ఉన్న బొలెరో గూడ్స్ వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. సంఘటనలో కరీముల్లా అక్కడికక్కడే మృతిచెందగా, అతని భార్య రిహానాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన కరీముల్లా భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఐదు నెలల కిందటే రిహానాను ప్రేమ వివాహం చేసుకున్నాడు. సోమవారం రాత్రి బైక్ పై తన సోదరి వద్దకు బద్వేలు మీదుగా ఆత్మకూరుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కరీముల్లా మృతి పట్ల సీపీఐ నాయకులు శ్రీరాములు, షావలి, శివరాం, భాస్కర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కరీముల్లా

కిలో వెండి స్వాధీనం

కడపకోటిరెడ్డిసర్కిల్ : కాచిగూడ నుంచి చెంగల్పట్టు వెళ్లే చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుడి నుంచి కిలో వెండి స్వాధీనం చేసుకున్నారు. గుత్తి నుంచి కడపకు ప్రయాణిస్తున్న వెంకటకృష్ణ అనే ప్రయాణికుడి బ్యాగులు తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న కిలో వెండిని స్వాధీనం చేసుకున్నట్లు కడప రైల్వే సీఐ నాగార్జున తెలిపారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మార్చి 9వ తేదీన శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్లు: 08562- 258622, 244622 లేదా ఈ- మెయిల్ అడ్రస్ కేఏడీఏపీఏ.డికోర్ట్స్‌డాట్ జీఓవీ డాట్ ఇన్, డీఎల్ఎస్ఏకేడీపీ అట్‌ది రేటాఫ్ జీ మెయిల్ డాట్ కామ్‌ని సంప్రదించాలని సూచించారు.

చిన్నకుడాలలో అగ్ని ప్రమాదం

- 8ఎకరాల అరటి పంట దహనం
- రూ.10లక్షల మేర పంట నష్టం

లింగాల : లింగాల మండలం చిన్నకుడాల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన రైతులు పురుషోత్తంరెడ్డి, కుప్పాల వాణిలకు చెందిన 8 ఎకరాలలో అరటి పంట దహనమైంది. అరటి గెలలతో ఉన్న పంట దహనం కావడంతో సుమారు రూ.10లక్షల మేర పంట నష్టం జరిగింది. అరటి గెలలతోపాటు డ్రిప్, ల్యాడర్, పోటు కట్టెలు కాలిబూడిదయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతూ విద్యుత్ సరఫరా కావడంవల్ల విద్యుత్ మోటార్ల వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించినట్లు రైతులు లబోదిబోమంటున్నారు. తోటలో ఎండిన గడ్డి ఉండటంతో అగ్ని ప్రమాదం జరిగిన గంటలోపే గెలలతో ఉన్న అరటి పంట కాలిబూడిదైంది. చేతికొచ్చిన అరటి పంట దహనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.


కాలిపోయిన అరటి పంట

సచివాలయంలో చోరీ


సచివాలయంలోని టేబుల్ ర్యాక్‌లు తెరిచి ఉన్న దృశ్యం

- ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లిన దుండగులు
- వైఎస్ జగన్ చిత్రపటం తుంచేసిన వైనం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని రెండవ వార్డు సచివాలయంలో దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఉదయాన్నే సచివాలయంలో కసువు ఊడ్చేందుకు వచ్చిన వృద్ధురాలు వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గమనించి వెంటనే సచివాలయ ఉద్యోగులకు సమాచారం అందించింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సచివాలయంలో దుండగులు గోడపై ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటాన్ని కింద పడేసి తుంచి వేశారని సచివాలయ ఉద్యోగులు తెలిపారు. పోలీసులు సచివాలయ సమీపంలో గాలింపు చేయగా ల్యాప్‌టాప్ మాత్రం కంపచెట్లలో దొరికింది. అలాగే సచివాలయం పక్కనే ఉన్న జాఫర్ అనే వ్యక్తికి చెందిన జనరల్ స్టోర్‌లో కూడా చోరీ జరిగిందని దుకాణదారుడు తెలిపారు. సుమారు రూ.40 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే ఈ సంఘటనపై సచివాలయం నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటాన్ని కింద పడేసి తుంచిన దృశ్యం